క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికి వినతి



డీఆర్‌ఓకు అర్జీ అందిస్తున్న నాగరాజు

తిరుపతి అర్బన్ : శెట్టిపల్లె భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం ఈ మేరకు డీఆర్‌ఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల రక్తదానం



-విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 57 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో పాలుపంచుకున్న విద్యార్థులను అభినందించారు. ఐఆర్‌సీఎస్ వైద్యాధికారి విజయ్ కుమార్, కో–ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ కుమార్ రాజు, డాక్టర్ ప్రతీత్, డాక్టర్ మల్లికార్జున, అధ్యాపకుడు భీమన్న పాల్గొన్నారు

పరిశోధనలపై అవగాహన

తిరుపతి సిటీ : జీవ వైవిధ్యం, బయో టెక్నాలజీ పరిశోధనలపై అవగాహన కల్పించేందుకు పద్మావతి మహిళా వర్సిటీలో సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. డీబీటీ– బిల్డర్ పథకం కింద యానిమల్ ఎక్స్‌పెరిమెంటల్ స్కిల్స్ ఇన్ బయో మెడికల్ రీసెర్చ్– మెథడ్స్, ఎథిక్స్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై పలువురు ప్రొఫెసర్లు అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శ్రీదేవి, రజిత, సురేష్ కుమార్, రమేష్, వినయ్ కుమార్, రజని, మమత, విద్యావతి, సుజాత పాల్గొన్నారు

గజవాహనంపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న అమ్మవారు.

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారు సోమవారం సాయంత్రం గజవాహనంపై మాడ వీధుల్లో విహరించారు. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాఢ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి గజవాహనంపై ఊరేగించారు. డిప్యూటీ ఈఓ గోవింద్ రాజన్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఏవీఎస్‌ఓ సతీష్‌కుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రాము, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు, చలపతి పాల్గొన్నారు.

రాకపోకలపై 'మట్టి'



దారిలో పోసిన మట్టి

చంద్రగిరి : మండలంలోని గంగుడుపల్లెలో గ్రామస్తుల రాకపోకలను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. సోమవారం గ్రామంలోని దారిపై మట్టి తోలించారు. దీంతో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఇటీవల తలెత్తిన దారి వివాదం కారణంగానే టీడీపీ నేతలు ఇలాంటి పనికి తెగబడ్డారని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. సమస్యలను స్థానిక పెద్దల సమక్షంలో లేదా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. ఇలా రోడ్డుకు అడ్డంగా మట్టిపోయడం సరికాదని మండిపడుతున్నారు.

అభినందన







దేశ రాజధానిలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రతిభ కనబరచిన ఎన్‌సీసీ క్యాడెట్లను అధికారులు అభినందించారు. సోమవారం పద్మావతి అతిథిగృహం సమీపంలోని ఎన్‌సీసీ హెడ్‌క్వార్టర్‌లో విద్యార్థులను సత్కరించారు. ఈ మేరకు క్యాడెట్లు లోకేష్, మహిమరాజు, అంజలికి ట్రోఫీతోపాటు నగదు బహుమతి అందించారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ శత్యాందర్ దయా, కల్నల్ సంజీవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - తిరుపతి సిటీ

ఆనందం



తిరుపతి కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సోమవారం కళాశాల వార్షికోత్సవంతో పాటు జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. సాంకేతిక విద్య ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడంపై అధ్యాపకులు దృష్టి సారించాలని కోరారు. ప్రిన్సిపల్ ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా తమ విద్యార్థులకు వివిధ సంస్థల్లో కొలువులు కల్పించామని వెల్లడించారు. అనంతరం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, అకడమిక్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ చేశారు. విభాగాధిపతులు ఎస్వీ గౌరీశంకర్, జీఎస్ రాధా పాల్గొన్నారు. - తిరుపతి ఎడ్యుకేషన్

గగనం గెలిచిన మగువ!



ఆకాశమే హద్దుగా.. అంతరిక్షమే అవధిగా విజయబావుటా ఎగురవేసిన సునీతా విలియమ్స్ ఎందరికో స్ఫూర్తినిస్తోంది. గగనం గెలిచిన మగువగా ప్రపంచమంతా కొనియాడుతోంది. సుమారు 9 నెలలపాటు నిండైన మనోధైర్యంతో శూన్యంలో గడిపిన అసామాన్య మహిళగా చరిత్ర కెక్కింది. నేటి ఆధునిక సమాజంలో మహిళలు, యువతకు ఆమె ఓ స్ఫూర్తి శిఖరంగా నిలుస్తోంది. ఈ క్రమంలో తిరుపతిలోని పలు విశ్వవిద్యాలయాల విద్యార్థినులు, పరిశోధకులు తమ మనసులోని మాటను వెల్లడించారు. సునీతా విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను అధిగమిస్తామని స్పష్టం చేశారు. – తిరుపతి సిటీ

• స్ఫూర్తి శిఖరం.. సునీతా విలియమ్స్ • మహిళామణులకు ఆదర్శం • నేటి యువతకు మార్గదర్శి

భయం వీడితేనే రాణిస్తాం



సునీతా విలియమ్స్ 59 ఏళ్ల వయసులో సైతం స్పేస్‌లో 9 నెలలు గడపడం అద్భుతం. భయం వీడితేనే మహిళలు రాణించగలరని ఆమెను చూసే నేర్చుకున్నాం. మేము అగ్రికల్చరల్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నాం. పరిశోధనలలో మరింత ముందుకు వెళ్లేందుకు సునీతా విలియమ్స్‌నే స్ఫూర్తిగా తీసుకుంటాం

- అలేఖ్య, సృజన, పీహెచ్‌డీ స్కాలర్స్, తిరుపతి

ఆమె ఓ స్ఫూర్తి కెరటం



భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియన్స్ మాలాంటి విద్యార్థినులకు ఓ స్ఫూర్తి కెరటం. అంతరిక్షంలో 286 రోజుల పాటు ఉన్నా కూడా భయం లేకుండా ఆ పరిస్థితుల్లో కూడా పలు పరిశోధనలు చేశారంటే ఆమె ధైర్యం, ఆత్మవిశ్వాసానికి జోహార్లు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యతో పాటు నూతన పరిశోధనల వైపు అడుగులు వేస్తాం.

- తేజస్విని, పావని, ఎమ్మెస్సీ ఫిజిక్స్ విద్యార్థినులు, ఎస్వీయూ

వ్యోమగాములకు దిక్సూచి



సూక్ష్మ గురుత్వాకర్షణ సవాళ్లను అధిగమించి తొమ్మిది నెలలకు పైగా అంతరిక్షంలో ఉండడం సామాన్య విషయం కాదు. అనలాగ్ వ్యోమగామిగా ఆమె దీర్ఘకాలిక మిషన్లకు చేసిన సేవలు ఆరాధిస్తాను. భవిష్యత్ వ్యోమగాములకు, స్టెమ్ రంగంలో రాణిస్తున్న మహిళలకు ఆమె దిక్సూచిగా నిలిచారు.

- జోషితరెడ్డి, నాసా అనలాగ్ ఆస్ట్రోనెంట్, తిరుపతి

వైఫల్యాలే పాఠాలు నేర్పాయి



జీవితంలో వచ్చే అడ్డంకులను మహిళలు ఓర్పు, పట్టుదలతో అధిగమించాలని సునీతా విలియమ్స్ నేర్పారు. ఊహించని విధంగా అంతరిక్ష కేంద్రంలో సుదీర్ఘకాలం గడిపిన ఆమెలో మనోధైర్యం చెక్కు చెదరలేదు. అంకిత భావం, సానుకూల దృక్పథంతో తిరిగి భూమిని చేరిన తీరు ఆదర్శనీయం. వైఫల్యాలను అవకాశాలుగా మలుచుకోవాలనే పాఠాలను ఆమె నుంచి నేర్చుకున్నాం

- సుస్మిత, సుమతి, పీఎం ఉషా ప్రాజెక్ట్ అసిస్టెంట్స్, మహిళా వర్సిటీ

ఆత్మవిశ్వాసంతో సాధించగలం



సునీతా సాహసం మాలాంటి ఇంజినీరింగ్ విద్యార్థినులలో ధైర్యాన్ని నూరిపోసింది. ఉన్నత చదువులను అభ్యసిస్తే మహిళలు ఏదైనా సాధించగలమనే నమ్మకం ఏర్పడింది. మహిళగా అత్యధిక స్పేస్ వాక్‌లు చేసి రికార్డు సృష్టించి నేటి యువతలో స్ఫూర్తినింపారు.

- శ్రీవాణి, వైష్ణవి, ఈసీఈ విద్యార్థినులు, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం.
- శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం.
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేటీ రోడ్డులోని సప్తగిరినగర్, కమ్మ సంఘం హాల్‌లో ఉదయం 6 నుంచి ఇన్నర్ ఇంజినీరింగ్ సదస్సు.
- పాకాల పంచాయతీలోని వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతు వధశాల, షాపింగ్ కాంప్లెక్స్‌లోని 3 రూములు, చింతచెట్లు, కొబ్బరి చెట్లు, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, పారిశుద్ధ్య వస్తువుల సరఫరా టెండర్లకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు.

స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్



మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : దేశం కోసం ప్రాణాలర్పించిన స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్ అని ఎస్వీయూ వీసీ అప్పారావు కొనియాడారు. సోమవారం వర్సిటీలోని కామర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులో దేశం కోసం ఉరికంబం ఎక్కిన యోధుడు భగత్‌సింగ్ అని, వారి తెగువ కారణంగానే మనం స్వాతంత్ర్యం అనుభవిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీవీ నర్సయ్య, ప్రొఫెసర్లు జయచంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, అంజన్ బాబు, రమేష్ బాబు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యూత్ వింగ్ స్పోక్స్ పర్సన్ ఎస్వీ భార్గవ్ సాయి పాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్ : ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పి.వెంకటరత్నం, ఐఎఫ్‌టీయూ నేత లోకేశ్వర్, ఎం.అరుణ, ఆర్. సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఫలితాలు



జ్ఞాపికను అందిస్తున్న ఆనందరెడ్డి

తిరుపతి రూరల్ : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చని సిద్ధార్థ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ వై.ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం సి.గొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆనందరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాల్లో విజయాలను సొంతం చేసుకునేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జ్ఞాపికలు బహూకరించారు. హెచ్‌ఓడీలు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

వాహనంలో మంటలు

తిరుపతి రూరల్: పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారిపై ఓ వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపేశారు. దీంతో అటుగా వచ్చే వాహనదారులు భయంతో కొంత దూరం పరుగులు తీశారు. తిరుపతి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. చిత్తూరు నుంచి తిరుపతి వస్తుండగా బాలాజీ డెయిరీ వద్ద ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

రాకపోకలకు అంతరాయం

తిరుపతి తుడా : తిరుమల బైపాస్ రోడ్డులోని 47వ నంబర్ పిల్లర్ వద్ద భూగర్భ డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మరమ్మతుల కారణంగా ఎస్‌కే ఫాస్ట్ ఫుడ్ ప్రాంతంలో ఐదురోజులపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

స్మగ్లర్‌పై పీడీ యాక్ట్

తిరుపతి మంగళం: ఎర్రచందనం అక్రమ రవాణాకు పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న తమిళనాడుకు చెందిన శివమణి గోవిందన్ అలియాస్ శివమణిపై టాస్క్‌ఫోర్స్ అధికారులు పీడీయాక్ట్‌ను అమలు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా నమోదైన కేసులను నిరూపించే విధంగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ముద్దాయిగా ఉన్న శివమణి గోవిందన్ (35)ను అరెస్టు చేశారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీచేశారు. కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

అవగాహనతో క్షయ నివారణ



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా : అవగాహనతో క్షయ వ్యాధి నివారణ సాధ్యమని స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. సోమవారం స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ 1882లో మైక్రోబ్యాక్టీరియం సూక్ష్మక్రిమిని రాబర్ట్ కాక్ కనుగొని మైక్రోబయాలజీ ఆవిర్భావానికి నాంది పలికారన్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న మందులతో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చునని చెప్పారు. స్విమ్స్‌లో రోగ నిర్ధారణ, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు

చంద్రగిరి : క్షయ నివారణ చంద్రగిరి యూనిట్ పర్యవేక్షకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి యుగంధర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉంటే టీబీ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ సౌమ్య ప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్‌వైజర్లు ప్రమీల నారాయణ రాజు, తులసీరామ్, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, శశిరేఖ, గిరిజ, దేవిక, వెంకటరమణ పాల్గొన్నారు.

క్షయ రహిత పంచాయతీగా అగరాల

చంద్రగిరి : క్షయ రహిత పంచాయతీగా అగరాల ఎంపికైంది. సోమవారం తిరుపతి రుయా ఆస్పత్రిలో నిర్వహించిన ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవంలో డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ ఈ విషయం ప్రకటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి అవార్డును అందుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పంచాయతీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసినట్లు తెలిపారు. ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్ఎం లక్ష్మి, పొదిలి సోమశేఖర్ పాల్గొన్నారు.